ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



చేతికందేలా ఉన్న విద్యుత్ తీగలను చూపుతున్న రైతు

శంషాబాద్ రూరల్: మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. పంట పొలాల్లో కిందకు వేలాడుతున్న తీగలతో రైతులు భయాందోళనకు చెందుతున్నారు. చేతికి అందేలా వేలాడుతున్న కరెంటు తీగలతో పొలం పనులు చేసుకోవడానికి భయపడుతున్నారు. కొన్ని సందర్భాల్లో పశువులు ప్రమాదాల బారిన పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన లైన్లతో తీగలు కిందకు వేలాడుతున్నాయని చెబుతున్నారు. దీనిపై అధికారులు స్పందించి సరిచేయాలని కోరుతున్నారు.

ప్యాచ్‌వర్క్స్ పరిశీలన



పనులను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ, హుడా కాలనీ, లాలమ్మ గార్డెన్ ప్రాంతాల్లో జలమండలి అధికారులు ఇటీవల తవ్వకాలు చేపట్టి పైపులైన్లు వేసి వదిలేశారు. దీంతో బీఆర్‌ఎస్ నేతలు జలమండలి అధికారులకు ఫిర్యాదు చేయగా.. వారు స్పందించి శనివారం మరమ్మతులు చేపట్టారు.

'ప్యూర్' ఎన్జీవో ప్రారంభం



విద్యార్థులతో ప్యూర్ ఎన్జీవో సంస్థ ప్రతినిధులు

బండ్లగూడ: 'హైదరాబాద్ యూత్ చాప్టర్ ఆఫ్ ప్యూర్ పీపుల్ ఫర్ అర్బన్ అండ్ రూరల్ ఎడ్యూకేషన్' ఎన్జీవో కిస్మత్‌పూర్‌లోని ప్రెస్టీజ్ రాయల్ వుడ్ క్లబ్‌హౌస్‌లో ప్రారంభించారు. శనివారం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డాక్టర్ అర్చన రవికుమార్, సీఈవో డా.శైలా తాళ్లూరి హాజరై మాట్లాడారు. సానుభూతి, నాయకత్వం, వైవిధ్యం, ఆవిష్కరణ, స్థిరత్వం, సామాజిక ప్రభావాన్ని పెంపొందించేందుకు ఈ చాప్టర్ ఉపయోగపడుతుందన్నారు. పేద విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను అందజేశారు. క్రిష్‌కోర్, క్లైం రాఘవరెడ్డి, రాకేష్‌రెడ్డి, సంతోష్‌కుమార్, వీణారెడ్డి, సమీర నిమ్మగడ్డ, వెంకట్, మామ, మధుమిత, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్‌ను కలిసిన ఆశావర్కర్లు

గోల్కొండ: నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలోని ఆశా వర్కర్ల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు వారు శనివారం నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆశా వర్కర్ల వేతనాన్ని 18 వేలకు పెంచాలని, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వం చేపట్టే వివిధ సర్వే కార్యక్రమాల్లో ఆశావర్కర్లను వినియోగించుకుంటున్నారని, వారి సమస్యలను మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విన్నవించారు. ఆయనను కలిసిన వారిలో సీఐటీయూ నాంపల్లి కన్వీనర్ సి.మల్లేష్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు లతారాణి, తారాబాయి, రీటా తదితరులు ఉన్నారు.

హర్షయానం పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత హర్షవర్ధన్ రచించిన హర్షయానం పుస్తకావిష్కరణ సభ శనివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు డాక్టర్ కేవీ.రమణాచారి మాట్లాడుతూ యాత్రా విశేషాలతో కూడిన పుస్తకాన్ని తీసుకురావడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ వైస్ చాన్స్‌లర్ ఎన్.గోపి, ఓయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.రఘు, కిన్నెర కార్యదర్శి మద్దాలి రఘురామ్ పాల్గొన్నారు.

పండుగకు ఊరెళ్తున్నాం!

- ఆరాంఘర్‌లో పెరిగిన ప్రయాణికుల రద్దీ
- పండుగ కోసం 80 ప్రత్యేక బస్సులు
- ప్రైవేటు సర్వీసులు ఇష్టానుసారంగా వసూలు



రద్దీలోనే బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

మైలార్‌దేవ్‌పల్లి: సంక్రాంతి పండుగ సందర్భంగా నగరవాసులు పల్లెటూర్లకు పయనమయ్యారు. తెలుగు రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు ముఖ్యమైన పండుగ కావడంతో నగరానికి వలస వచ్చిన వారు ఎక్కువగా ఉండటంతో పలు బస్‌స్టేషన్లలో రద్దీ పెరిగింది.

రాజేంద్రనగర్ సర్కిల్‌లో..

ఆరాంఘర్ చౌరస్తా అన్ని ప్రాంతాల ప్రజలకు అందుబాటులో ఉండటంతో సీబీఎస్,ఎంజీబీఎస్ బస్ డిపోకు వెళ్లకుండా ఇక్కడి నుంచి మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్,తిరుపతి, కర్ణాటక ప్రాంతాలకు వెళ్తున్నారు.

స్పెషల్ సర్వీసులు..

ఆర్టీసీ ఆరాంఘర్ నుంచి స్పెషల్ సర్వీసులను నడుపుతుండటంతో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు తమ సొంతూళ్లకు వెళ్లే వారికి కొంత సులభతరంగా మారింది. కొన్ని ప్రత్యేక బస్సుల్లో ఆన్‌లైన్ బుకింగ్‌లు ఉండటంతో ప్రయాణికులకు సీట్లు ఉన్నాయని మహబూబ్‌నగర్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ శ్యామల పేర్కొన్నారు. ఆర్టీసీ ప్రతిరోజు కంటే 80 ప్రత్యేక బస్సు సర్వీసులను అదనంగా నడుపుతున్నట్లు ఆమె వివరించారు. ఉదయం నుంచి ప్రయాణికుల రద్దీ పెరుగుతుందన్నారు.

ప్రయాణికులకు తగిన సౌకర్యాలు..

ఈ రద్దీ మరో మూడ్రోజులు ఉంటుందని, ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా తాగునీటితో పాటు ఇతరత్రా సౌకర్యాలకు తగిన ఏర్పాట్లు చేశామని ఆర్టీసీ అధికారులు చెప్పారు. స్పెషల్ బస్సులు ఏర్పాటు చేయడం వల్ల కొంత మేర చార్జీలను పెంచామన్నారు.

ప్రైవేటు బస్సుల హోరు..

ఆరాంఘర్ చౌరస్తాలో ప్రతినిత్యం ప్రైవేట్ బస్సుల్లో ఇతర రాష్ట్రాలకు ఇక్కడి నుంచి బయలు దేరుతారు. సంక్రాంతి కావడంతో రద్దీ తీవ్రతను బట్టి



బస్సుకోసం ఎదురుచూస్తూ..

ఇష్టానుసారంగా చార్జీలు వేస్తున్నారని పలువురు వాపోతున్నారు. ఊర్లకు వెళ్లే ప్రయాణికుల నుంచి ఆర్టీసీ బస్సుల చార్జీల కంటే నాలుగింతలు ఎక్కువగా వసూలు చేస్తున్నట్లు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చార్జీలు పెంచినప్పటికీ సీట్లు భర్తీ అవుతున్నాయి.

సంప్రదాయాలను కాపాడుకోవాలి



విజేతలతో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కార్తీక్‌రెడ్డి

మణికొండ: మన పండుగలు సంస్కృతి, సంప్రదాయాలతో పెనవేసుకుని ఉంటాయని, వాటిని నిలుపుకోవటంతో పాటు భవిష్యత్‌తరాలకు అందించాల్సిన అవసరం ఉందని, బీఆర్‌ఎస్ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి అన్నారు. ఆ పార్టీ మణికొండ మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ పోటీల్లో న్యాయ నిర్ణేతగా విశ్రాంత ప్రొఫెసర్ సుధామాధవి వ్యవహరించారు. మొదటి బహుమతి రమ్యకు రూ.5వేలు, రెండో బహుమతి లతకు రూ.3వేలు, మూడో బహుమతి కైవసం చేసుకున్న సంధ్యకు రూ.2వేల నగదుతో పాటు కన్సోలేషన్ ప్రైజ్‌లను విజయ, వనజలకు అందజేశారు. బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సీతారాం, కార్యనిర్వాహక అధ్యక్షుడు ధన్‌రాజ్, నాయకులు మల్యాద్రినాయుడు, నరేందర్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, షేక్ అరీఫ్, కుమార్, ఎస్.శ్రీకాంత్, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

రహదారి విస్తరణ బాధితులను ఆదుకోవాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నేతలు

శంషాబాద్: పట్టణంలోని సిద్ధాంతి రైల్వేగేటు నుంచి ధర్మగిరి రోడ్డు వరకు చేపడుతున్న రహదారి విస్తరణలో ఆస్తులు కోల్పోయేవారని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కార్యదర్శి జంగయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ విస్తరణలో పేదల ఆస్తులే అధికంగా పోతున్నాయని వాపోయారు. పూర్తిగా ఇళ్లు కోల్పోతున్న వారికి పరిహారంతో పాటు ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించాలన్నారు. ఆర్.యాదగిరి, నర్సగిరి, ఆనంద్‌గౌడ్, జైపాల్‌రెడ్డి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ధనుర్మాస పూజలు



స్వామి వారికి అందజేసిన నైవేద్యం



వేణుగోపాలస్వామి

రాజేంద్రనగర్: ధనుర్మాసం సందర్భంగా రాజేంద్రనగర్ చైతన్య విలాస్ కాలనీలోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో శనివారం 108 గంగాళాలలో నైవేద్యం సమర్పించారు. గతనెల 16 నుంచి ధనుర్మాస ప్రత్యేక పూజలు ప్రారంభమై ఈనెల 14 వరకు కొనసాగుతాయని ఆలయ కమిటీ సభ్యులు ప్రకటించారు.

14న గోదాదేవి కల్యాణం..

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవులలోని శ్రీ రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయంలో ఈనెల 14న ఉదయం 10గంటలకు గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

న్యాయవాదిపై దాడి హేయం

యాకుత్‌పురా: ఏపీలోని పొన్నూరులో న్యాయవాది బేతాళ ప్రకాష్‌రావుపై దాడి చేసిన పోలీసులపై ప్రభుత్వం వెంటనే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ పొన్నూర్ పట్టణ పోలీసులు అకారణంగా ప్రకారావుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం అత్యంత హేయమైన చర్య అని అన్నారు. దాడికి పాల్పడిన సీఐ రవికిరణ్, ఎస్సై రాజకుమార్‌లపై ఏపీ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

అంబేడ్కర్ యూత్ క్లబ్‌లో సంక్రాంతి వేడుకలు



రాజేంద్రనగర్: బుద్వేల్‌లోని అంబేడ్కర్ యూత్ క్లబ్‌లో సంక్రాంతి వేడుకలను మాల, ఉపకులాల సంఘం నేతలు ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా జాతీయ షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ జాతీయ అధ్యక్షుడు, దళితరత్న రాజు ఉస్తాద్ డిసెంబర్‌లో జరిగిన 'మాల మహాగర్జన' సభకు సహాయ సహకారాలు అందించిన కార్యకర్తలను శాలువాతో సత్కరించారు. పచ్చా శ్రీనివాస్, డాక్టర్ వేము వందనం, రమేష్, వీరన్న, అశోక్‌కుమార్, శ్రీశైలం, శంభుస్వామి, సాయికృష్ణ, ముత్యాలు, నర్సింహా, సంజీవ్, పంబాల రాజు, లక్ష్మణ్, చంద్రశేఖర్, సత్యనారాయణ, కన్నయ్య, రవీందర్, భరత్, శంకర్ ఉన్నారు.

కల్వర్టులో పడి వ్యక్తి మృతి

రాజేంద్రనగర్: కల్వర్టులో పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై మామిడి కిశోర్ తెలిపిన వివరాల ప్రకారం ... బండ్లగూడ ఆరెమైసమ్మ ప్రాంతానికి చెందిన జయరాం (36) కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. కాగా రోజూ ఇంటి పరిసరాల్లో తిరిగి ఇంటికి వచ్చేవాడు. దారి తప్పి ఇతర ప్రాంతాలకు వెళ్తుండటంతో కుటుంబసభ్యులు అతడి చేతి మణికట్టుపై సెల్‌ఫోన్ నంబర్‌ను పచ్చబొట్టుగా పొడిపించారు. గతంలో రెండు, మూడుసార్లు ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో స్థానికులు ఫోన్‌నంబర్ ఆధారంగా జయరాంను కుటుంబసభ్యులకు అప్పగించారు. శుక్రవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో ఇంటి ముందు కూర్చొని ఉన్న అతడు ప్రమాదవశాత్తు కల్వర్ట్‌లో పడి మృతి చెందాడు. గమనించిన స్థానికులు రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా అనంతరం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. చేతిపై ఉన్న సెల్‌ఫోన్ నంబరు ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. కేసు దర్యాప్తులో ఉంది.

అక్రమ పార్కింగ్‌లపై కొరడా



గోల్కొండ: ఇష్టారాజ్యంగా వాహనాలను రోడ్లపై పార్కింగ్ చేసే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని టోలిచౌకి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ సుధాకర్ అన్నారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో టోలిచౌకి, షేక్‌పేట్ నాలా, పాత ముంబై జాతీయ రహదారి తదితర ప్రాంతాల్లో అక్రమ పార్కింగ్‌లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు అక్రమంగా రోడ్లపై పార్కు చేయడం చట్టరీత్యా నేరమని, ఎంతటి వారైనా సరే అక్రమ పార్కింగ్ చేసే వారిని సహించబోమని అన్నారు.

ముగిసిన తలసేమియా రక్తదాన శిబిరం

చార్మినార్: అగర్వాల్ సమాజ్ తెలంగాణ, హైదరాబాద్ కట్‌పీస్ క్లాత్ మర్చంట్ అసోసియేషన్, హోల్‌సేల్ ఆర్ట్ సిల్క్ క్లాత్ మర్చంట్ అసోసియేషన్ సహకారంతో ఘాన్సీబజార్ మార్కెట్‌లోని సూరజ్ భవన్‌లో రక్తదాన శిబిరానికి చక్కటి స్పందన లభించింది. రక్త రుగ్మతైన తలసేమియాతో బాధపడుతున్న చిన్నాల సౌకర్యార్థం రెండు రోజులపాటు జరిగిన ఈ రక్తదానం శిబిరం శనివారం ముగిసింది. దాతల నుంచి మొత్తం 314 యూనిట్ల రక్తాన్ని సేకరించి తలసేమియా, సికిల్ సెల్ సొసైటీకి అందజేశారు. శిబిరంలో తలసేమియా, సికిల్ సెల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ చంద్ర కాంత్ అగర్వాల్‌తోపాటు అగర్వాల్ సమాజ్ తెలంగాణ అధ్యక్షుడు మనీష్ అగర్వాల్, వైస్ ప్రెసిడెంట్ పురుషోత్తం అగర్వాల్, కోశాధికారి నవీన్ అగర్వాల్, గౌరవ కార్యదర్శి కపూర్ చంద్, హైదరాబాద్ కట్ పీస్ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్, ఆర్ట్ సిల్క్ క్లాత్ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పల్లకి సేవ ఊరేగింపు

చాంద్రాయణగుట్ట: వైకుంఠ ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా లాల్‌దర్వాజా పూల్‌బాగ్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారంరాత్రి పల్లకిసేవ ఊరేగింపు కొనసాగింది. ఆలయ కమిటీ చైర్మన్ బాశెట్టి లెనిన్ బాబు ఆధ్వర్యంలో ఊరేగింపు, ఆలయ అర్చకులు మోహనాచార్యుల పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం నిర్వహించిన కుడారై మహోత్సవంలో ఛత్రినాక ఏసీపీ సీహెచ్ చంద్రశేఖర్, గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మీ, సెట్విన్ మాజీ డైరెక్టర్ కొప్పుల ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

చిరువ్యాపారుల షాపులు తొలగింపు

- నిరసన చేపట్టిన బాధితులు
- మద్దతు తెలిపిన బీఆర్‌ఎస్ నేతలు



బీజాపూర్ జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న బాధితులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి హైదర్షాకోట్ ఎర్రకుంట సమీపంలోని చిరు వ్యాపారుల షాపులను మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు శనివారం కూల్చివేశారు. ఈ కూల్చివేతలతో తమకు జరుగుతున్న నష్టం గురించి కంటతడి పెట్టుకున్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేతలు చేపట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు మద్దతుగా బీఆర్‌ఎస్ పార్టీ నేతలు మద్దతు తెలిపి నిరసనలో పాల్గొన్నారు. తాము చిరువ్యాపారులకు అండగా ఉంటామని బీఆర్‌ఎస్ నేత నాగరాజు అన్నారు. దాదాపుగా రూ.కోటి వరకు నష్టం జరిగిందని బాధితులను ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు, కమిషనర్ ఆదుకోవాలన్నారు. లేదంటే బాధితులకు అండగా నిరసనతో పాటు పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్పొరేటర్, బీఆర్‌ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



చేనేత సహకార సంఘం అధ్యక్షుడు పున్న కృష్ణ

మైలార్‌దేవ్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఆదర్శ కాలనీ చేనేత సహకార సంఘం (కార్వాన్‌శాఖ) అధ్యక్షుడు పున్న కృష్ణ హర్షం వ్యక్తం చేశారు. శనివారం సంఘం ఆవరణలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి చేనేత కార్మికులు పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత అభయహస్తం పథకాన్ని చేనేత కార్మికుల కోసం తీసుకొచ్చిందన్నారు. ఈ పథకం ద్వారా నేతన్నల సంక్షేమానికి ప్రభుత్వం రూ.168 కోట్లు కేటాయించిందని చెప్పారు. రేవంత్‌రెడ్డి తీసుకున్న చొరవ వల్ల ఎంతో మంది నేత కార్మికులకు మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు విజ్ఞానవంతులుగా ఎదగాలి



విజ్ఞాన ప్రదర్శనలో వాలంతరీ రిసెర్చ్ సెంటర్ డైరెక్టర్ నాగేందర్

మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థులు అన్ని రంగాల్లో పాల్గొన్నప్పుడే విజ్ఞానవంతులుగా ఎదుగుతారని వాలంతరీ రిసెర్చ్ సెంటర్ డైరెక్టర్ నాగేందర్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ మధుబన్ కాలనీలోని శ్రీ గాయత్రీ ఈ-టెక్నో పాఠశాలలో విజ్ఞాన ప్రదర్శన శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు తాము తయారు చేసిన పరికరాలను ప్రదర్శనలో ఉంచారు. తల్లిదండ్రులు, విద్యార్థులు అధిక సంఖ్యలో సందర్శించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నాగేందర్ మాట్లాడుతూ.. విద్యార్థులు చక్కగా చదువుకుని తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. అన్ని రంగాల్లో పాలుపంచుకుంటూ విజ్ఞానవంతులుగా ఎదగాలని సూచించారు. పాఠశాల చైర్మన్ మధుసూదన్, డైరెక్టర్ శ్రీహరి, ప్రిన్సిపాల్ రచనాపటేల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సగర సంఘం కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మణికొండ: భగీరథ సగర (ఉప్పర) సంఘం మణికొండ శాఖ కేలండర్‌ను ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఆవిష్కరించారు. శనివారం ఆయన నివాసంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. సగరుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డి, మణికొండ సగర సంఘం అధ్యక్షుడు వెంకటస్వామి, గౌరవ అధ్యక్షులు మహదేవ్, ఆర్. వెంకటేశ్వర్లు, హనుమంతు, దేవేందర్, ప్రధాన కార్యదర్శులు గోపాల్, వేముల కృష్ణ, కోశాధికారులు కృష్ణయ్య,నాగేశ్వర్, ఆర్. నరసింహులు, కృష్ణ, మహిళా అధ్యక్షురాలు సునీత, నారమ్మ పాల్గొన్నారు.

ప్రైవేటు బస్సుల తనిఖీలు



తనిఖీ చేస్తున్న జిల్లా రవాణాశాఖ అధికారులు

రాజేంద్రనగర్: నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న 16 బస్సులపై కేసు నమోదు చేయడంతో పాటు ఒక బస్సును రంగారెడ్డి జిల్లా రవాణా శాఖ అధికారులు సీజ్ చేశారు. శనివారం ఆరాంఘర్ చౌరస్తాలో ఉదయం వివిధ జిల్లాల నుంచి వస్తున్న ప్రైవేటు బస్సులకు తనిఖీలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న ప్రైవేటు బస్సుల డ్రైవర్లు శంషాబాద్ నుంచి దారి మళ్లించి హిమాయత్‌సాగర్ మీదుగా తమ గమ్య స్థానాలకు చేరారు. గత మూడు రోజులుగా రవాణాశాఖ అధికారులు ప్రైవేటు బస్సులను తనిఖీ చేస్తున్నారు.

మసీదుల నిర్వహణ పారదర్శకంగా ఉండాలి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఫారూఖ్ అశ్రఫ్ మసీదు నిర్వాహకులు

గోల్కొండ: మసీదుల నిర్వహణ పారదర్శకంగా ఉండాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన గోల్కొండలోని ఫారూఖ్ అశ్రఫ్ మసీదు నిర్వహణ కమిటీ వారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయనను మసీదు నిర్వహణ కమిటీ సభ్యులు సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అత్యంత పురాతనమైన మసీదుల్లో ఫారూఖ్ అశ్రఫ్ మసీదు ఒకటని అన్నారు. మసీదు అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హరూన్‌ఫరాన్, అబ్దుల్ రహీం , వజీఉజ్ జమా సిద్దిఖీ తహసీన్ పాషా, తౌఫిక్ తదితరులున్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి



గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: పండుగలు శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. శనివారం ఆయనను శ్రీ గోల్కొండ జగదాంబిక మహంకాళీ అమ్మవారి వృత్తిపని వారి సంఘం మాజీ అధ్యక్షుడు బి.సాయిబాబా సన్మానించారు. బోనాలతోపాటు ఇతర పండుగలను శాంతియుతంగా నిర్వహించేలా సయ్యద్ ఫయాజ్ పటిష్టమైన చర్యలు తీసుకున్నారని సాయిబాబాచారి అన్నారు. కార్యక్రమంలో టోలిచౌకి డివిజన్ బీజేపీ అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌చారి, న్యాయవాది వాణిశ్రీ, మహంకాళీ ఆలయ పూజారి సురేష్‌చారి, మల్లేష్‌చారి, ఏసీపీ కార్యాలయ ఐటీ సెల్ విభాగానికి చెందిన వీరయ్య పాల్గొన్నారు.

ఘన నివాళి

గన్‌ఫౌండ్రీ: మాజీ దివంగత ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయన చిత్రపటానికి ఏఐసీసీ ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్, టీపీసీసీ కార్యదర్శి మణిలాల్‌షా, ఉపాధ్యక్షులు కుమార్‌రావు తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.